క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: యాడికి మండలం చందన గ్రామానికి చెందిన పలు టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు ఆధ్వర్యంలో చందన గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, రంగడు, నాగేష్ తదితర కుటుంబాల వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

మజ్దూర్ యూనియన్ ప్రతినిధులను గెలిపించండి

గుత్తి: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ ప్రతినిధులను గెలిపించాలని యూనియన్ డివిజన్ సెక్రటరీ విజయకుమార్ కోరారు. గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో మంగళవారం రైల్వే కార్మికులతో సభ నిర్వహించారు. అనంతరం ఆర్‌ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్, రైల్వే ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు.

బ్యాంకు అభివృద్ధికి పాటుపడదాం



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత

గుంతకల్లు: ఏడీసీసీ బ్యాంకు అభివృద్ధికి పాటుపడదామని బ్యాంకు జిల్లా చైర్‌పర్సన్ ఎం.లిఖిత పిలుపునిచ్చారు. స్థానిక ఏడీసీసీ బ్యాంకును మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, సీఎం సురేఖరాణి, నోడల్ ఆఫీసర్ జీ ప్రసాద్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో బ్యాంకు పురోగతి, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఖాతాదారుల డిపాజిట్లు, రుణాల మంజూరుపై సలహాలు అందించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు సుంకిరెడ్డితో సొసైటీ అభివృద్ధిపై మాట్లాడారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



జెడ్.వీరారెడ్డి కాలనీ సమీపంలో బోరు తవ్వుతున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, పాలక వర్గం చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 చోట్ల బోర్లు ఏర్పాటు చేసి పైప్‌లైన్‌ల ద్వారా సంప్‌లకు, కొళాయిలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. మంగళవారం అనంతపురం రోడ్డు, జెడ్.వీరారెడ్డి కాలనీ సమీపంలో బోర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సత్యసాయి, వైటీసీ పథకాల ద్వారా సరిపడినంత నీరు రావడం లేదన్నారు. ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు రూ. 80 లక్షలు వెచ్చించి బోర్లు, పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టండి



ఆవులాంపల్లి వద్ద కొర్రపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దవడుగూరు: రైతులు రసం పీల్చే పురుగు, గులాబీరంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త శశికళ, కిశోర్‌కుమార్‌రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. మంగళవారం ఆవులాంపల్లిలో వారు పత్తి, కొర్ర, జొన్న పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గులాబీరంగు పురుగు, రసం పీల్చే పురుగు నివారణ కు అసిపేట్ 75 ఎస్పీ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అసిటాంప్రైడ్ 0.3 గ్రాములు 1 లీటర్ నీటికి లేదా అల్లిఫైరోఫేన్ 0.2 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా పైరిడాలిత్ 2 మి.లీలు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. టర్సికం బ్లైట్ అనే తెగులు మొక్కజొన్నను నాశనం చేస్తోందని, నివారణకు హెక్సాకొనజోల్ 1 గ్రాము 1 లీటర్ నీటికి కలపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఓ మల్లేశ్వరి పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



సాకే పద్మావతి

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సాకే పద్మావతి. భర్త పేరు నాగేంద్ర. వీరిది సిద్దరాచర్ల. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ముగ్గురు పిల్లలు. నాగేంద్ర రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా రూ.5 లక్షలు, పింఛన్ ద్వారా రూ.1,13,500, రైతు భరోసా ద్వారా రూ.34,500, అమ్మఒడి రూ.55,000 చొప్పున మొత్తం రూ.7,02,500 లబ్ధి చేకూరింది. అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానని చెబుతోంది.



గొల్లపల్లిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



పాళ్యంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం మాలవాండ్లపల్లి, కమ్మ కొట్టాల, గొల్లపల్లి, సిద్దరాచర్ల, బోయ కొట్టాల, దుర్గం గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు. ఈసందర్భంగా పలువురు సమస్యలు తెలియజేయగా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో పేదల కష్టాలను తెలుసుకున్న జగనన్న వారి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలో ప్రభుత్వ సేవలను గడప వద్దే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైరపర్సన్ నాగరత్నమ్మ, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సొసైటీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, సర్పంచు రామాంజినేయులు, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, కో ఆప్షన్ షాబీరా, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు , వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం
ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం పాళ్యం గ్రామంలో ఎమ్మెల్యే తనక కుమార్తె, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా పాళ్యం రహదారిపై వంతెన నిర్మాణం, పాళ్యం–కత్రిమల గ్రామానికి తారురోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరాగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ సర్కారు పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో జైలు పాలు అవ్వడాన్ని తెలుగుతమ్ముళ్లు జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతుండడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. తాను ఏ అవినీతికి పాల్పడకపోతే సచ్ఛీలుడుగా బాబు ఎందుకు బయటపడలేకపోతున్నారన్నది ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవుతన్నాయన్నారు. అవినీతి పరుడైన బాబుకు జనసేననేత వత్తాసు పలకడంపై ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. వారిద్దరికీ ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ లీలాబాయి, సర్పంచ్‌లు రామాంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: నవరత్నాల పథకాలతో జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. బుగ్గ, బోగసముద్రం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు రామేశ్వరెడ్డి, రామ్మోహన్, మునెప్ప, సూర్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, పెద్దు, రాజు, ఉసేనప్ప, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు

తాడిపత్రి అర్బన్: శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రభోజుడు అని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం రాయల వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనివాసపురంలోని శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహానికి బలిజ సంఘం అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు రాయల సేవలను గుర్తు చేసుకున్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సుంకులమ్మపాలెం, నంద్యాల రోడ్డులో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈసందర్భంగా సుంకులమ్మ పాలెంకు చెందిన కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి సుంకులమ్మ ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వార్డుల్లో ఎక్కడైనా అండర్ డ్రైనేజీకి సంబంధించి మ్యాన్‌హోల్స్ బ్లాక్ అయ్యాయా అని స్థానికులతో ఆరా తీశారు. అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ జి.రవిని ఆదేశించారు. వీధుల్లో దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, నాయకులు జనార్దన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అప్పా లక్ష్మీనారాయణ, సూర్యప్రభాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



కేస్ షీట్ అందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పామిడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం పాళ్యం జగనన్న ఆరోగ్య శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. వైఎస్సార్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి మరింత భద్రత లభించిందన్నారు. మండల ఆరోగ్య సురక్ష వైద్య పర్యవేక్షణాధికారి సుధాకర్, వైద్యులు అనిల్‌కుమార్, ఎల్లప్ప, మాలతి, మనీషా 550 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. గుంతకల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, జెడ్పీటీసీ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పెద్దపోలమడ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సుమన్‌కుమార్, లావణ, ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీ సంధ్య 416 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ప్రత్యేక అధికారి నారాయణ స్వామి, ఎంపీడీఓ రంగారావు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. మున్సిపల్ కమిషనర్ జి.రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బుక్కరాయసముద్రం: వెంకటాపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు శ్రీహర్ష, వినోద్, నారాయణరెడ్డి 507 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. జెడ్పీటీసీ భాస్కర్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, సర్పంచ్ వసంత్‌కుమార్, ఎంపీటీసీ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

శింగనమల: లోలూరు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ మొరార్జీ, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓ నరసింహరాజు, మండల వైద్యాధికారి ఫిర్దోస్ పాల్గొన్నారు.

యల్లనూరు: చింతకాయమంద సచివాలయం వద్ద మంగళవారం స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్యులు కీర్తన, అంజాద్ అలి, లోకేష్, గోపాల్ 410 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. తహసీల్దారు సుమతి, ఎంపీడీఓ వీరరాజు, హెల్త్ సూపర్‌వైజర్ రాము పాల్గొన్నారు.

గుత్తి: చెట్నేపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్లు వరలక్ష్మి, పద్మలత కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కౌన్సిలర్లు గద్దల రూతమ్మ, వరదరాజులు పాల్గొన్నారు.

యాడికి: గుడిపాడు గ్రామంలో మంగళవారం సర్పంచు దండు సావిత్రి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యులు పరమేశ్వర్, అప్పయ్య రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేశారు.

గార్లదిన్నె: ఇల్లూరు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. సర్పంచు జయరాములు, ఉప సర్పంచు శంకర, ఎంపీడీఓ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

దుర్గామాతా నమోస్తుతే!



గాయత్రీ దేవి అలంకరణలో యాడికి పెద్దమ్మ తల్లి

సాక్షి బృందం: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల అర్చకులు అమ్మవార్లను వివిధ రూపాల్లో కొలువుదీర్చి విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



గుత్తిలో రాజరాజేశ్వరి దేవి అలంకారంలో జకినీ మాత



గుంతకల్లులో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో వాసవీ అమ్మవారు



తాడిపత్రిలో గాయత్రి అలంకారంలో వేదగాయత్రీమాత



గుంతకల్లులో గాయత్రీదేవి అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి



పామిడిలో అన్నపూర్ణ దేవిగా అంబాభవాని



తాడిపత్రిలో కామాక్షీదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి



తాడిపత్రిలో మోహినీ అలంకారంలో కొలువుతీరిన ఆనందవల్లి



తాడిపత్రిలో బాలా త్రిపురసుందరీదేవిగా అంబాభవాని

ప్రజల కోసమే చెరువులో పూడికతీత పనులు



మాట్లాడుతున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లు రూరల్: ప్రజా ప్రయోజనాల కోసమే చెరువులో పూడికతీత పనులు చేపట్టామని పులగుట్టపల్లి గ్రామపెద్దలు, రైతులు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వారు జెడ్పీటీసీ కదిరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, కొంగనపల్లి ఎంపీటీసీ హరి చక్రవర్తి, మండల యువజన కన్వీనర్ సుంకన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దాదాపు 153 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజుల గుడి చెరువులో పూడిక పేరుకుపోయి నీరు నిల్వ ఉండటం లేదన్నారు. రైతుల కోరిక మేరకు చెరువులో పూడిక తొలగించి మట్టిని కూడా రైతుల పొలాలకే తరలిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీ నేతలు అక్రమంగా చెరువు మట్టిని తవ్వి విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు చేయడం, నిజానిజాలు విచారించుకోకుండా పత్రికల్లో వార్తలు రాయడం సరికాదన్నారు. పులగుట్టపల్లి గ్రామ పెద్దలు, రైతులు పామన్న, పెద్దరంగయ్య, దేవదాసు, మల్లికార్జున, సీతారాముడు, సుధాకర్, వీరయ్య, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువును కాపాడాలని వినతి

రాజుల గుడి చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని పులగుట్టపల్లి పెద్దతండా, చిన్నతండా గ్రామాల సర్పంచులు మంగళవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, రూరల్ సీఐ మహేశ్వరరెడ్డికి విన్నవించారు. నాయకులు వెంకటేష్ నాయక్, హనుమాన్ నాయక్, గోవింద నాయక్, ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, ముని నాయక్, లక్ష్మానాయక్, చిన్నస్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

'అధికారులూ.. న్యాయం చేయండి'



పట్టా చూపుతున్న బాధితులు

బుక్కరాయసముద్రం: 40 ఏళ్లుగా అనుభవిస్తున్న తమ భూమిని కొందరు అధికారులు ఇతరుల పేరున ఆన్‌లైన్ చేశారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. మంగళవారం వారు విలేకరుల ఎదుట వివరాలు వెల్లడించారు. రేగడి కొత్తూరు రోడ్డు సమీపాన కొట్టాపల్లికి చెందిన దూదూకుల వన్నూరప్పకు ప్రభుత్వం 40 ఏళ్ల క్రితం పట్టా ఇవ్వడంతో పంటలు సాగు చేసుకుంటూ ఉండేవాడు. అతడి మరణానంతరం అతని కుమారుడు దూదేకుల వన్నూర్‌వలికి 1997లో సర్వే నంబర్ 14-1,లో 2.30 ఎకరాలు, 14-2,లో 2.31 ఎకరాలకు పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి వన్నూర్ వలి, అతని భార్య వహిదా తమ పొలంలో బోరు వేసుకుని వరి, పత్తి, టమాట సాగుతో పాటు రూ.20 లక్షలతో కోళ్ల ఫారం పెట్టుకుని జీవనం గడుపుతున్నారు. భూమలకు ధరలు పెరగడంతో వీటిపై నార్పల మండలం కేసేపల్లికి చెందిన టీడీపీ నాయకులు కుళ్లాయిస్వామి, నార్పలకు చెందిన ఎర్రినాగప్ప అప్పట్లో పార్టీని అడ్డు పెట్టుకుని రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చి వారి పేరున పట్టా రాయించుకున్నారని దూదేకుల వన్నూర్ వలి, వహిదా వాపోయారు. తాము సాగు చేస్తున్న భూమిని ఆన్‌లైన్‌లో తిరిగి తమ పేరు మీద మార్చాలని 9 ఏళ్లగా అర్జీలు పెట్టుకున్నా రెవెన్యూ అధికారులు ఎవరూ స్పందించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలని కోరారు.

నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి

గుంతకల్లు: ప్రతి ఉద్యోగి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నారాయణ స్వామి సూచించారు. మంగళవారం డిపోలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అత్యధిక ఆదాయంతో పాటు డీజిల్ ఆదా చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతోపాటు నగదు బహుమతులు అందజేశారు. ఉద్యోగులు ఆర్టీసీని అభివృద్ధి పథంవైపు నడపాలని డీఎం పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం

కంటి వైద్యశిబిరం

పామిడి: స్థానిక షాదీఖానాలో మంగళవారం పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్య నిపుణురాలు అమృత 120 మందికి కంటి పరీక్షలు చేసి 74 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, క్లబ్ అధ్యక్షురాలు శాంతిప్రియ, ఉపాధ్యక్షుడు జయరాంరావు, జిల్లా చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21లోపు రేషన్ పంపిణీ పూర్తి చేయండి

శింగనమల: శింగనమల, నార్పల మండలాల్లోని ఎండీయూ ఆపరేటర్లు ఈనెల 21లోపు రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21న పంపిణీ పూర్తి చేసి, రిటర్న్ స్టాక్, రిటర్న్ పేమెంట్ కంప్లీట్ చేయాలన్నారు.

తప్పిన ప్రమాదం

పామిడి: పొగరూరు వద్ద కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న కారు వేగాన్ని నియంత్రించుకోలేక పొగరూరు వద్ద వంతెన ప్రహరీని ఢీకొంది. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. కారు ముందు భాగం దెబ్బతినింది.

రేపు పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గురువారం పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాల్లో రైతులు పండ్ల తోటలు సాగు చేస్తున్నారన్నారు. పండ్ల తోటలో రైతుల సమస్యల పరిష్కారం కోసం సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పి.కమ్మన్న మంగళవారం విజ్ఞప్తి చేశారు. దసరా సెలవులు దృష్ట్యా చదువంటే మా కిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, పలు క్రీడలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్రకారుడు శ్రీధర్, క్రీడా శిక్షకులు కోమలి సలీమ్ పిల్లలకు శిక్షణ ఇచ్చారు. ట్యూటర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. సహ గ్రంథాలయాధికారి ఎం.హేమలత ఉన్నారు.

21న కురుబ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

పెద్దపప్పూరు: ఈనెల 21 జిల్లా కేంద్రంలో కురుబ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరగనున్నట్లు తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని కురుబ సంఘం సమావేశం జరిగింది. సంఘం మండలాధ్యక్షుడు పెద్దవెంకటనారాయణ,విశ్రాంత విద్యాధికారి మాధవ పాల్గొన్నారు .

ఇసుక లారీ, ట్రాక్టర్ పట్టివేత

తాడిపత్రి అర్బన్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం బోగసముద్రం వద్ద లారీ, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్లు రామకృష్ణ, ఆంజనేయులును అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.